క్లుప్తంగా

వాటర్ కూలర్ బహూకరణ



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామానికి చెందిన హోటల్ నిర్వాహకుడు ఖాజాబాయ్ జుమామసీదుకు రంజాన్ ఉపవాసదీక్షల సందర్భంగా వాటర్ కూలర్‌ను బుధవారం బహూకరించారు. రూ.22వేల విలువగల 45లీటర్ల కెపాసిటీ ఉన్న ఫ్రిజ్‌ను మసీద్ ప్రెసిడెంట్ సయ్యద్ సమద్, మోలిసాబ్ నిసార్‌లకు అందజేశారు. మసీదు సభ్యులు షేక్ శకీల్, నూరెముజస్సాం పాల్గొన్నారు.

పలు ఆరోపణలతో ఎస్సై బదిలీ?

రేగొండ: అధికారాన్ని అడ్డుపెట్టుకుని అధికార పార్టీ నాయకుడికి సాయం చేయబోయి ఎస్సై అడ్డంగా ఇరుకున్నట్లు మండలంలో చర్చ జరుగుతోంది. కొత్తపల్లిగోరి మండలంలోని ఓ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడి కాంట్రాక్టర్ పనుల నిమిత్తం స్థానిక ఎస్సై సందీప్‌కుమార్ కంకర కావాలని క్రషర్ యజమానితో మాట్లాడి తక్కువ ధరకు పోయించినట్లు తెలిసింది. అలాగే జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో పని ఉందని ఇటుకల కోసం సిమెంట్ బ్రిక్స్ యజమానులను కోరడంతో వారు నిరాకరించి ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో ఎస్పీ చేపట్టిన దర్యాప్తులో ఆరోపణలు నిజమని తేలడంతో వీఆర్‌కు అటాచ్ చేసినట్లు తెలిసింది. కాగా, ఎస్సై బదిలీకి కారణమైన కాంగ్రెస్ నాయకుడిని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు క్యాంపు కార్యాలయానికి పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

గీత కార్మికుడికి గాయాలు



రేగొండ: ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు గండి సదయ్య వృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. తోటి కార్మికులు 108లో పరకాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సౌకర్యాలు కల్పించాలి

వాజేడు: రంజాన్ మాసం సందర్భంగా ముస్లింకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ముస్లిం మత పెద్దలు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ఉపవాస దీక్షలను చేస్తున్న క్రమంలో తాగునీరు, వీధి దీపాలు, నిరంతర విద్యుత్ సౌకర్యం, వైద్యం, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా అధికారులు చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ విజయ, ఎస్సై రాజ్‌కుమార్, విద్యుత్ ఏఈ అర్షద్ అహ్మద్, డీటీ సత్యనారాయణ, ఆర్ఐ కుమార స్వామి తదితరులున్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి



గోవిందరావుపేట: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్స్ స్కీం సంస్థ లింక్ వర్కర్ తప్పెట్ల కిషన్, ఐసీటీసీ కౌన్సిలర్ వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని చల్వాయిలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో మిషన్ 95 క్యాంపెనింగ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రజలకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం 57 మందికి హెచ్ఐవీ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఆశకార్యకర్తలు అనిత, స్వాతి పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చిట్యాల: మండలంలోని చైన్‌పాక గ్రామానికి పెద్ది కిష్టస్వామి (60) పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల తెలిపిన కథనం ప్రకారం.. కిష్టస్వామి మద్యానికి బానిసై తరచుగా ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడని తెలిపారు. ఈ నెల 2న మద్యం తాగి ఇంటికి వచ్చిన కిష్టస్వామిని అతడి భార్య స్వరూప మద్యం ఎందుకుతాగవని ఘర్షణ పడింది. దీంతో ఆవేశంతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఈశ్వరయ్య తెలిపారు.

రోడ్డుపైనే వారసంత

- ఇబ్బంది పడుతున్న ప్రజలు, వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



టేకుమట్లలో రోడ్డుపైనే కొనసాగుతున్న వారసంత

టేకుమట్ల: వ్యాపార పరంగా ఎంతో అభివృద్ధి పథంలో కొనసాగుతున్న టేకుమట్ల నూతన మండలంగా ఏర్పడిన అనంతరం మరింత అభివృద్ధి చెందింది. మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా వ్యాపార నిమిత్తం టేకుమట్ల మండలంతో పాటు, చిట్యాల, మొగుళ్లపల్లి మండలాల ప్రజలు సైతం మండల కేంద్రానికి నిత్యం వస్తూ వ్యాపార లావాదేవీలు నిర్వహించుకుంటారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 13 సంవత్సరాల నుంచి మండల కేంద్రంలో చౌరస్తాలోనే ప్రతీ బుధవారం వారసంతను నిర్వహిస్తోన్నారు. సాధారణ రోజుల్లోనే నిత్యం రద్దీగా ఉండే మండల కేంద్రం వారసంత రోజున జనాలతో కిక్కిరిసిపోతోంది. రోడ్డుకు ఇరువైపులా దుకాణాల ముందు సంత నిర్వహించడం వల్ల రోడ్డు మొత్తం ఇరుకుగా మారుతోంది. దీంతో వాహనదారులు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వారసంతను ప్రధాన రోడ్డుపై కాకుండా ప్రత్యేక స్థలంలో ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రతీ వారం సంతకు వస్తా..



నిత్యావసర సరుకుల కోసం ప్రతీ బుధవారం సంతకు వస్తా. సాయంత్రం వేళలో రోడ్డుపై జనాలతో ఇబ్బందిగా ఉంటుంది. ద్విచక్రవానంపై వెళ్లాలేని పరిస్థితి. సంతను ప్రత్యేక స్థలంలో ఏర్పాటు చేస్తే ఎవరికీ ఇబ్బంది ఉండదు.

- రాఘవేంద్ర, రాఘవరెడ్డిపేట

ప్రత్యేక స్థలం ఉంటే అభివృద్ధి



మండల కేంద్రంలో నిర్వహించే వార సంతకు ప్రత్యేక స్థలం ఉంటే మరింత అభివృద్ధి చెందుతుంది. పశువులకు స్థలం ఉన్నా కూరగాయాలు, తదితర విక్రయదారులకు ప్రత్యేక స్థలం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వారసంత కోసం ప్రత్యేక స్థలం ఏర్పాటు చేయాలి.

- ఐలయ్య, వారసంత కాంట్రాక్టర్

ఇబ్బంది పడుతున్నాం..



కంటే సంత రోజున కూరగాయల వ్యాపారం సంతృప్తిగా ఉంటుంది. చౌరస్తాలో ఎక్కువ జనాలతో కిక్కిరిసి పోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. వాహనాలకు ఇబ్బంది కలుగకుండా ప్రత్యేక స్థలం ఏర్పాటు చేస్తే ఎవరికీ ఇబ్బంది లేకుండా ఉంటుంది. రోడ్డుపై సంత నిర్వహించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

- కుమార్, కూరగాయల వ్యాపారి, టేకుమట్ల

శ్రీపాల్‌రెడ్డి గెలుపుతో సంబురాలు



సంబురాల్లో పీఆర్‌టీయూ నాయకులు

మొగుళ్లపల్లి: నల్లగొండ, వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించడంతో మండలం కేంద్రంలో పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో బుధవారం సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బాణాసంచా పేల్చి మిఠాయిలు పంచుకున్నారు. మండలంలోని ఉపాధ్యాయులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పింగిలి విజయపాల్ రెడ్డి మాట్లాడుతూ.. శ్రీపాల్ రెడ్డి గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్, మండల శాఖ అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సాంబయ్య, జిల్లా కార్యదర్శి కుమారస్వామి, మండల కార్యదర్శి చంద్రయ్య పాల్గొన్నారు.

పశువులను అక్రమంగా తరలిస్తే చర్యలు

- సీఐ బండారి కుమార్



అరెస్టు చూపుతున్న పోలీసులు

వెంకటాపురం(కె): పశువులను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ బండారి కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చొక్కాల గ్రామ సమీపంలో పశువులు తరలిస్తున్న నాలుగు బొలెరా వాహనాల్లో స్వాధీనం చేసుకున్నారు. పశువులను తరలిస్తున్న వ్యక్తులపై అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అక్రమంగా పశువులను తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు చొక్కాల గ్రామ సమీపంలో నాలుగు బోలెరా వాహనాల్లో 42 పశువులను తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వాహనాలను సీజ్ చేసి తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకోని విచారించగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి హైదరాబాద్‌కు పశువులను తరలిస్తున్నట్లు తెలిపారని పేర్కొన్నారు. ఈ మేరకు వరంగల్ జిల్లాకు చెందిన మోహమ్మద్ షఫీ, ములుగు మండలం జంగాలపల్లికి చెందిన రాజేందర్, సంపత్, సుగాలి రాజేందర్, మహేశ్ ములుగు జిల్లా మల్లంపల్లికి చెందిన మోహ్మద్ సమీర్, యాసిన్‌పాషా, ఆత్మకూరు మండలం నీరుకుల్ల గ్రామానికి చెందిన మోహమ్మద్ జాఫర్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కొప్పుల తిరుపతి రావు, ఏఎస్సై రామచంద్రు, సిబ్బంది రాజమౌళి తదితరులు ఉన్నారు.

చేపల దొంగతనంపై ఫిర్యాదు

కాటారం: మండలంలోని విలాసాగర్ పెద్ద చెరువులో కొన్ని రోజులుగా చేపల దొంగతనం జరుగుతుందని గ్రామానికి చెందిన గంగపుత్ర సంఘం నాయకులు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఆగస్టులో సంఘం ఆధ్వర్యంలో జీవనోపాధి కోసం చేపల పెంపకం చేపట్టినట్లు పేర్కొన్నారు. పది రోజులుగా గుర్తు తెలియని వ్యక్తులు రాత్రిపూట వచ్చి దొంగతనంగా చేపలను పట్టుకుంటున్నారని తెలిపారు. తెల్లవారుజామున తాము చెరువు వద్ద కాచుకొని ఉండగా గంగారానికి చెందిన కొందరు వ్యక్తులు చేపలను దొంగతనానికి వచ్చారని వారి ఫొటోలు సైతం తీసుకున్నామన్నారు. తమను చూసి దొంగలు పారిపోయినట్లు తెలి పారు. ఇప్పటి వరకు సుమారు 4 క్వింటాళ్ల మేర చేపలు దొంగలించారని తమకు తీవ్ర నష్టం వాటిల్లిందని చేపల దొంగతనంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో సంఘం అధ్యక్షుడు పెద్దపెల్లి రాజయ్య, ఉపాధ్యక్షుడు అట్టెం కిరణ్, కార్యదర్శి కాపరబోయిన మహేశ్, సభ్యులు స్వామి, రమేశ్, రాంచందర్, శ్రీనివాస్, బాలరాజు, నర్సయ్య, అంజి ఉన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



చిట్యాల: విద్యార్థులను తనిఖీ చేస్తున్న కళాశాల సిబ్బంది



కాళేశ్వరం: పరీక్ష కేంద్రం వద్ద నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సర వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. జనరల్ విద్యార్థులు 122, ఒకేషనల్ 39 మందికి గాను ఆరుగురు విద్యార్థులు హాజరు కాలేదు. పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఫ్లయింగ్ స్కాడ్ బాలు నాయక్ బృందం తనిఖీ చేశారు. కాగా ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు బుక్ కాలేదని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ చంద్ర పలకల ప్రసాద్, డిపార్ట్‌మెంటల్ అధికారి బుర్ర రాజాబాబులు తెలిపారు.

మల్హర్: మండల కేంద్రం తాడిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తొలిసారి ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తొలిరోజు కావటంతో విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు పరీక్ష కేంద్రాల వద్దకు 8 గంటలకు చేరుకున్నారు. అధికారులు విద్యార్థుల హాల్‌టిక్కెట్లు పరిశీలించి లోపలికి అనుమతించారు. పరీక్ష కేంద్రంలో 128 మంది విద్యార్థులు గాను114 మంది హాజరయ్యారు. జిల్లా నోడల్ అధికారి భూక్య వెంకన్న పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు.



మల్హర్‌లో..

చిట్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాన్ని నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని 310 మంది విద్యార్థులకు 302 మంది, ఆదర్శ పాఠశాలలో 341 మందికి 333 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ కర్ణాజీ, ప్రిన్సిపాల్ రమేశ్ పేర్కొన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత



విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం బాలాజీ

మంగపేట: మండలంలోని రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం గోమాత విజ్ఞాన పరీక్షలు నిర్వహించారు. గోమాత విజ్ఞాన పరీక్షల్లో ఎంపికైన 31 మంది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బాలాజీ మాట్లాడుతూ.. గోవుల ద్వారా పాలు, పెరుగు, వెన్న, నెయ్యి లభిస్తుందని తెలిపారు. పంచికం, పేడతో సేంద్రియ వ్యవసాయం, సేంద్రియ ఉత్పత్తులను తయారు చేసుకోవచ్చని అన్నారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, నాగమణి, ప్రసాద్, వీరనారాయణ, జమున, పావని, రామారావు, రాజ్యలక్ష్మి, గణేష్, పద్మ, ప్రవీణ్‌కుమార్, పోషన్న, రాజయ్య, మహాదేవి, సుజాత, సురేందర్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీమెటీరియల్ అందజేస్తున్న నాయకులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుకు కాంగ్రెస్‌పార్టీ నాయకులు స్టడీ మెటీరియల్‌ను హెచ్‌ఎం అన్నపూర్ణ సమక్షంలో బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రేవెల్లి మమతనాగరాజు, నాయకులు కామిడి శ్రీనివాస్‌రెడ్డి, మెంగాని అశోక్, శకీల్, మాడుగుల పవన్‌శర్మ, మంగాయి లక్ష్మణ్, గందెసిరి సత్యనారాయణ, జానీ, మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

ధ్యానోత్సవ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పోలీసులు, నాయకులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలో శ్రీ సాయిబాబా దేవాలయం ఆధ్వర్యంలో హార్ట్ ఫుల్ నెస్ సంస్థ, శ్రీ రామచంద్ర మిషన్ సహకారంతో ఆలయంలో ధ్యానంతో పాటు యోగా ఉచిత శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు సీఐ అనుముల శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ధ్యానోత్సవ కరపత్రాలను ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్‌తో పాటు ఎస్సై తాజుద్దీన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఈనెల 8, 9, 10న సాయంత్రం 6.30 నుంచి 7.30 గంటల వరకు ఈ శిబిరం నిర్వహిస్తారని తెలిపారు. ప్రస్తుత కాలంలో యోగా, ధ్యానం అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా ఆలయ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అబ్జల్ పాషా, దేవాలయ కమిటీ వైస్ చైర్మన్ పర్వతాల కుమార్ స్వామి, కార్యదర్శి బస్సు సతీష్ కుమార్, కోశాధికారి వెంకట్రావు, ములుగు జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్, అబ్బోజు రాజేంద్ర చారి, సుహాసిని, నరేష్, గంగాధర చారి పాల్గొన్నారు.

నష్టపోయిన రైతుల వివరాల ప్రదర్శన



తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతుల వివరాలను ప్రదర్శిస్తున్న అధికారులు

వెంకటాపురం(కె): మండలంలో నకిలి మొక్కజొన్న విత్తనాలతో నష్టపోయిన రైతుల వివరాలను బుధవారం తహసీల్దార్, మండల ప్రజా పరిషత్, పంచాయతీ కార్యాలయాల వద్ద వ్యవసాయ శాఖ అధికారులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి నవీన్ మాట్లాడుతూ.. కలెక్టర్, ఆర్డీఓ, డీఏఓ ఆదేశాల మేరకు మండలంలో మొక్కజొన్న విత్తనాలతో నష్టపోయిన రైతుల వివరాలు ఏఈఓలు వారం రోజులు పాటు తిరిగి సేకరించారని తెలిపారు. సేకరించిన వివరాలను ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రదర్శనకు ఉంచినట్లు వెల్లడించారు. మండలంలో ఇంకా మొక్కజొన్న పంట నష్టపోయిన రైతులు ఉంటే వారి వివరాలు ఏఈఓలకు అందించాలని తెలిపారు.

9న న్యాయ కళాశాల సదస్సు



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

వాజేడు: భద్రాచలం కేంద్రంగా ఆదివాసీల కోసం న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ వెంకటాపురం(కె) మండల కేంద్రంలో ఈ నెల 9న నిర్వహించే న్యాయ కళాశాల సదస్సు నిర్వహిస్తున్నట్లు గోండ్వానా సంక్షేమ పరిషత్ జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి పూనెం ప్రతాప్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కోయవీరాపురం, పెనుగోలు కాలనీ, గుమ్మడిదొడ్డి, చెరుకూరు, కొంగాల తదితర గ్రామాల్లో ఆదివాసీ యువకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా న్యాయ కళాశాల సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సదస్సుకు ఆదివాసీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

మంగపేట: విద్యార్థులు ఇష్టంతో చదవుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని దాత గఫార్‌ఖాన్ అన్నారు. మండలంలోని నర్సింహాసాగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం పదోతరగతి విద్యార్థులకు ఆల్ ఇన్‌వన్ పుస్తకాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నాగభూషణం, ఉపాధ్యాయులు పెట్రం సుధాకర్‌రావు, బాలాజీ, సమ్మయ్య, మాధవి పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



స్వయం పరిపాలన దినోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ములుగు రూరల్: మండలంలోని జంగాలపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఒక్క రోజు ఉపాధ్యాయులుగా మారి పాఠాలను భోదించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం



దగ్ధమవుతున్న పూరిల్లు

మంగపేట: మండలంలోని తిమ్మంపేట నేతకాని(ఎస్సీ) కాలనీకి చెందిన గోమాసు సమ్మయ్య పూరిల్లు బుధవారం రాత్రి అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. స్థానికులు తెలిపిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సమ్మయ్య అతడి మనుమడు దుర్గం శశినాథ్ దంపతులతో కలిసి నివాసం ఉంటున్నాడు. శశినాథ్ అతడి భార్య భూపాలపల్లిలో కొద్ది రోజుల క్రితం ప్రసవించడంతో అక్కడికి వెళ్లాడు. సమ్మయ్య ఇంటికి తాళం వేసి ఏటూరునాగారంలో ఉంటున్న అతడి కూతురు ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో రాత్రి సుమారు 07గంటల ప్రాంతంలో ఆకస్మాత్తుగా మంటలు వచ్చాయి. స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా పూరిల్లు పూర్తిగా కాలి బూడిదయింది. ఇంట్లోని విలువైన గృహోపకర వస్తువులు, బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి పట్టీలు సుమారు రూ.80,000 నగదుతో పాటు పలు విలువైన వస్తువులు కాలిపోయాయి.

వైభవంగా పోచమ్మ బోనాలు



బోనాలతో వెళ్తున్న గ్రామస్తులు

చిట్యాల: మండలంలోని ఒడితల గ్రామంలో పోచమ్మ బోనాలను గ్రామస్తులు వైభవంగా నిర్వహించుకున్నారు. భక్తి శ్రద్ధలతో డప్పు చప్పులతో పోతరాజుల ఆటలతో బోనాలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లించి చల్లగా చూడాలని, పాడిపంటలు పండాలని కోరుకున్నారు.